క్లుప్తంగా

నేడు ముచ్చర్లకు మంత్రి సబిత రాక

కందుకూరు: మండలంలోని ముచ్చర్లలో ఫార్మాసిటీ కారణంగా భూములు కోల్పోయిన రైతులకు సోమవారం ఇళ్ల సర్టిఫికెట్లను అందించడానికి మంత్రి సబితారెడ్డి రానున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు బీ జంగారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు గ్రామ వడ్డెర సంఘం కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించిన అనంతరం లబ్ధిదారులకు ఇళ్ల సర్టిఫికెట్లు పంపిణీ చేయనున్నారని ఆయన తెలిపారు.

మర్యాదపూర్వక కలయిక



ప్రధాని మోదీకి భగవద్గీత అందజేసి నమస్కరిస్తున్న దేవేందర్‌రెడ్డి

కందుకూరు: బీజేపీ మహేశ్వరం నియోజకవర్గం కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి ప్రధాని నరేంద్రమోదీని శనివారం సాయంత్రం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి భగవద్గీత అందజేశారు.

చలివేంద్రాలు ప్రారంభం



తిరుమల హిల్స్ కాలనీలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నర్సింహ

మీర్‌పేట: వేసవిలో బాటసారులు, వాహనదారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని మీర్‌పేట కార్పొరేషన్ 26వ డివిజన్ కార్పొరేటర్ పీ నర్సింహ అన్నారు. తిరుమలహిల్స్ కాలనీ అధ్యక్షుడు టీవీ శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో 8, 26, 27 డివిజన్లలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ఆదివారం కార్పొరేటర్లు కీసర హరినాథ్‌రెడ్డి, పసునూరి భిక్షపతిచారిలతో కలిసి నర్సింహ ప్రారంభించారు. ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు శ్రీరామమూర్తి తెలిపారు. కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి పాలెం నరేందర్‌గౌడ్, కోశాధికారి విక్రంకుమార్, ఉపాధ్యక్షులు జనార్దన్‌చారి, సత్యనారాయణ ముదిరాజ్, లక్ష్మీనారాయణ, కృష్ణ, రాజారాం తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణానికి చెందిన సయ్యద్ లతీఫ్‌కు కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం కింద రూ.48 వేలు మంజూరయ్యాయి. ఆమనగల్లు పట్టణంలోని సయ్యద్ లతీఫ్‌ను కలిసి మున్సిపల్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్ సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గుత్తి బాలస్వామి, సయ్యద్ ఖలీల్, చుక్క నిరంజన్‌గౌడ్, రమేశ్‌నాయక్, వెంకటేశ్, ఆనంద్, యాదయ్య, ముజాయిద్, అఫ్రోజ్, గిరి తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేసిన ఎమ్మెల్యే..

అబ్దుల్లాపూర్‌మెట్: మండలంలోని మజీద్‌పూర్ గ్రామానికి చెందిన ఎడ్ల రాజేష్ ముదిరాజ్‌కు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.40వేల చెక్కును ఆదివారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కొత్త కిషన్‌గౌడ్, ఉపాధ్యక్షుడు నారోజు రాజారాంచారి, గ్రామశాఖ అధ్యక్షుడు ఎడ్ల మహేందర్ ముదిరాజ్‌లు పాల్గొన్నారు.

ఈస్టర్ గుట్టకు స్థలం కేటాయిస్తాం



ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే రత్నం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ఈస్టర్ గుట్ట స్థలాన్ని ప్రార్థనల కోసం కేటాయించేందుకు కృషి చేస్తానని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకువెళ్లి తగు చర్యలు తీసుకుంటానన్నారు. ఈస్టర్ గుట్టపై ఆదివారం నిర్వహించిన ఈస్టర్ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పలు ప్రాంతాలకు చెందిన వందలాది మంది వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత 70 ఏళ్లగా ఈస్టర్ గుట్టపై ప్రతి సంవత్సరం ఈస్టర్ వేడుకలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ స్థలాన్ని కేటాయించాలని క్రైస్తవులు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. దీనిపై మంత్రి కేటీఆర్, ఉన్నతాధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలపించిన భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.రత్నం, వైఎస్‌ఆర్‌టీపీ చేవెళ్ల ఇన్‌చార్జి కె.ఎస్.దయానంద్, రగడంపల్లి శ్రావణ్, కోరని బాల్‌రాజ్, ధర్మారెడ్డి, పలుగుచెరువు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

తండాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

- బంజార భవన్ నిర్మాణానికి రూ. 2కోట్లు
- మంత్రి సబితారెడ్డి
- కృతజ్ఞతలు తెలిపిన గిరిజనులు



మంత్రి సబితారెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు, తండావాసులు

మహేశ్వరం: గ్రామాలకు దీటుగా గిరిజన తండాలను అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. మహేశ్వరం – మన్సాన్‌పల్లి వయా ఉప్పుగడ్డ తండాకు బీటీ రోడ్డు మంజూరు కావడంతో ఆదివారం ఉప్పుగడ్డ తండావాసులు, బీఆర్‌ఎస్ నాయకులు మంత్రిని కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహేశ్వరం – మన్సాన్‌పల్లి రోడ్డు నిర్మాణానికి రూ. 3.21 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ తండాలకు అధిక నిధులు కేటాయించి అభివృద్ధికి బాటలు వేస్తున్నారని పేర్కొన్నారు. తండాలకు పంచాయతీ హోదా కల్పించి ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి వైపు నడిపించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మహేశ్వరంలో బంజార భవన్ నిర్మాణానికి ప్రభుత్వం రూ. 2 కోట్లు నిధులు మంజూరు చేసిందన్నారు. బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్, దుర్గమ్మ ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. మండలంలోని తండాలకు లింకు రోడ్ల నిర్మాణానికి రూ. 9.41 కోట్లు మంజూరు చేశామని, త్వరలో టెండర్లు పిలిపించి పనులు ప్రారంభిస్తామన్నారు. కేసీ తండా సమీపంలో ఎలక్ట్రానిక్ పార్కులో విప్రో, మలబార్ కంపెనీలు రాకతో స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయన్నారు. త్వరలో మరిన్ని భారీ కంపెనీలు ఏర్పాటు చేస్తామని ఆమె పేర్కొన్నారు. అంతకు ముందు ఉప్పుగడ్డ తండాకు చెందిన పలువురు తమకు ఇళ్ల స్థలాలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్లు వేయాలని మంత్రిని కోరారు. ఇందుకు ఆమె సానుకూలంగా స్పందించారు. సబితారెడ్డిని కలిసిన వారిలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఎస్ జాన్‌రెడ్డి, సేవాలాల్ మహరాజ్ ఆలయ కమిటీ అధ్యక్షుడు సీతారామ్ నాయక్, కేతావత్ రాజు నాయక్, సేవ్యా నాయక్, బన్సీలాల్ నాయక్, సురేష్ నాయక్, కల్యాణ్ నాయక్ పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు

మహేశ్వరం: మండలంలోని లిల్లీపూర్ సెయింట్ థామస్, మహేశ్వరం, దుబ్బ చర్ల, కేకే బస్తీ చర్చిల్లో ఆదివారం ఈస్టర్ పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. 40 రోజుల అనంతరం క్రిస్టియన్లు ఈస్టర్ పర్వదినం సందర్భంగా ఉపవాస దీక్షను ముగించారు. ఈస్టర్‌ను పురస్కరించుకొని లిల్లీపూర్, కేకే బస్తీల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కొవ్వొత్తులు వెలిగించి క్రీస్తును స్మరించుకున్నారు. పాస్టర్లు దైవ సందేశం వినిపించారు. కార్యక్రమంలో దుబ్బచర్ల, కల్వకోల్ సర్పంచులు స్లీవారెడ్డి, గాదె థామస్‌రెడ్డి, దుబ్బచర్ల ఉప సర్పంచ్ పీ దేవేందర్ పాల్గొన్నారు.



లిల్లీపూర్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రిస్టియన్లు

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్



బడంగ్‌పేట్: ఇఫ్తార్ విందులో పాల్గొన్న భాస్కర్‌రెడ్డి, నర్సింహారెడ్డి తదితరులు



హుడాకాంప్లెక్స్: ఇఫ్తార్ విందులో పాల్గొన్న బాలకిషన్, ఎస్‌ఐ మాధవరావు

- పీసీసీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి

బడంగ్‌పేట్: మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ అని పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. ఆదివారం బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని కాలనీలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ ఇఫ్జల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో భాస్కర్‌రెడ్డి, కార్పొరేషన్ మాజీ వైస్ చైర్మన్ చిగురింత నర్సింహారెడ్డి, కార్పొరేటర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. రంజాన్ పండుగను ప్రతి ఇక్కరూ ఆనందోత్సవాల మధ్య ప్రశాంతంగా జరుపుకోవాలని కోరా రు. ఇఫ్తార్ విందులు హిందూ, ముస్లింల మధ్య ఐక్యతను పెంచుతాయన్నారు. అనంతరం ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రియాజ్, మహమ్మద్ గుల్షన్, యూసుఫ్ ఖాద్రి, ఇమ్రాన్ అలీ, అక్బర్, సమీర్, హబీబ్ ఉమర్, అఫ్జల్, సమ్మద్, ఫేజిల్ ఖాద్రి, నదీమ్ తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ నగర్‌లో..

హుడాకాంప్లెక్స్: పండుగలు ప్రజల మధ్య సోదర భావాన్ని నింపుతాయని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బేర బాలకిషన్ అన్నారు. సరూర్‌నగర్ డివిజన్ భగత్‌సింగ్ నగర్‌లో మైనార్టీ నాయకుడు సలీం ఆధ్వర్యంలో జరిగిన ఇఫ్తార్ విందుకు బాలకిషన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలు పండుగలు కలిసి మెలసి జరుపుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సరూర్ నగర్ ఎస్‌ఐ మాధవరావు, మహ్మద్ రహీం, మహ్మద్ ఖరీం, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు మహేందర్, మసీద్ కమిటీ అధ్యక్షుడు పాషా, మత పెద్దలు, ముస్లింలు, నాయకులు మల్లేష్, యశ్వంత్‌రెడ్డి, మహమ్మద్ కరీం, ముస్తఫా, సుభాన్, అమీర్, అఫ్జల్, ఇమ్రాన్, హైమద్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలతో మేలు



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కవిత

- కార్పొరేటర్ కవిత

బడంగ్‌పేట్: ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు మేలని స్థానిక కార్పొరేటర్ ఆర్ కవిత అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడ 26వ డివిజన్ తిరుమలనగర్ ఫేస్ –2లో సహస్ర హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత హెల్త్ క్యాంప్‌ను ఆదివారం కవిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలనీల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి ఉచితంగా మందులు అందజేశారు. బీఆర్‌ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు ఆర్ రాంరెడ్డి, కాలనీ అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి, ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి మహేందర్‌రావు, నాయకులు అర్జున్, తిరుపతయ్య, యాదగిరి, దశరథ పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి చేయూత

తలకొండపల్లి: మండల పరిధిలోని దేవుని పడకల్‌కు చెందిన దాస బాలమణికి చెందిన నివాసగృహం శిథిలమై కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తోందోనని ఆ ఇల్లును కూల్చివేసి అదే ప్రదేశంలో నూతన ఇంటి నిర్మాణం చేపట్టింది. నిర్మాణానికి డబ్బులు లేక ఆమె ప్రతిరోజు మథనపడుతుండేది. విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ కాడమోని శ్రీశైలం ఆమె ఇంటి నిర్మాణానికి కొంత సహాయం చేయాలని తలంచాడు. ఇంటి నిర్మాణం కోసం రూ.10,600 ఆర్థిక సహాయాన్ని ఆదివారం బాలమణికి అందజేశారు. కార్యక్రమంలో రామస్వామి, భిక్షపతి, రమేష్, శ్రీను, అంజయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల ట్రస్టు ఆధ్వర్యంలో..

తలకొండపల్లి: మండల పరిధిలోని జూలపల్లికి చెందిన గుమ్మడయ్య రాములమ్మ నూతన ఇంటి నిర్మాణం చేపట్టింది. డబ్బులు లేక ఇంటి నిర్మాణాన్ని మధ్యలోనే ఆపివేసింది. స్థానిక నాయకులు, మాజీ సర్పంచ్ జైపాల్‌రెడ్డి ద్వారా విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ వెంకటేశ్... తన ఉప్పల చారిటబుల్ ట్రస్టు ద్వారా ఆదివారం రాములమ్మ ఇంటి నిర్మాణానికి అవసరమయ్యే ఇసుక, కాంక్రీట్, సిమెంట్ స్టీల్, ఇటుక తదితర మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జైపాల్‌రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ రమేశ్, శ్రీను, శ్రీశైలం, మల్లేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన ప్రభుత్వాలు

- నిత్యావసరాల ధరల అదుపులో విఫలం
- కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు భగవాన్‌రెడ్డి



తలకొండపల్లి: కరపత్రాలు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

తలకొండపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించాయని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు భగవాన్‌రెడ్డి అన్నారు. పన్నుల రూపంలో ప్రజలను దోచి, ఇబ్బందులకు గురిచేస్తోన్న ప్రభుత్వాలకు చరమగీతం పాడుదామని పేర్కొన్నారు. మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లిలో ఆదివారం కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో హాథ్ సే హాథ్ జోడో యాత్ర నిర్వహించారు. భగవాన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి గ్రామంలో పర్యటించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్నాయని కరపత్రాలు పంపిణీ చేశారు. దేశం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందని నిరుద్యోగం, ద్రవ్యోల్బణం పెరిగిపోయిందన్నారు. రైతులు అప్పుల్లో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ సంపద కొంతమంది పారిశ్రామికవేత్తల చేతుల్లోనే ఉందని విమర్శించారు. పెట్రోల్, డీజిల్ ధరలతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పిన నాయకులు నేడు వాటి ఊసే ఎత్తడం లేదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేజీ టూ పీజీ వరకు ఉచిత విద్య, డబుల్ బెడ్రూం ఇళ్లు, నిరుద్యోగం భృతి, దళితులకు మూడెకరాల భూమి, తదితర హామీలన్నీ తుంగలో తొక్కిందన్నారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్త చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, ఎండీ.అజీం, ప్రభాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్, మండలాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, జిల్లా కార్యదర్శి మహేష్, సోషల్ మీడియా ఇన్‌చార్జి అజీం, అనిల్, విష్ణుగౌడ్, ఆరీఫ్, కృష్ణ, డేవిడ్, జగన్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హామీలపై చార్జిషీట్ విడుదల

కడ్తాల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ మోసపూరిత హామీలపై నియోజకవర్గ ప్రజల బహిరంగ చార్జిషీట్ వాల్‌పోస్టర్‌ను యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హీరాసింగ్ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, స్థానిక ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ గత 2018 ఎన్నికల సమయంలో ఎన్నో హామీలు ఇచ్చారని గుర్తుచేశారు. ఆమనగల్లు, కల్వకుర్తిలోని ఆస్పత్రులను 150 పడకల ఆస్పత్రులుగా అప్‌గ్రేడ్ చేస్తామని.. డిగ్రీ, ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినా నేటికీ కార్యరూపం దాల్చలేదని మండిపడ్డారు. ఇలా అనేక మోసపూరిత హామీలను కేంద్రీకరిస్తూ చార్జిషీట్ వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్నామన్నారు. బీఆర్‌ఎస్ మోసపూరిత హామీలను ప్రజల్లోకి తీసుకువెళ్లి.. హామీలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ప్రతి గ్రామంలో అంటిస్తామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో కల్వకుర్తి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీకి, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం తథ్యమన్నారు. గ్రామఅధ్యక్షుడు భానుకిరణ్, నాయకులు విష్ణు, రాజేందర్, రాజేశ్, తులసీరాం, తిరుపతిరెడ్డి, శ్రీకాంత్, భరత్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



మారుతీనగర్‌లో పర్యటిస్తున్న బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి

రాజేంద్రనగర్: ప్రజా సమస్యలను తెలుసుకునేందుకే బస్తీలు, కాలనీల్లో పర్యటిస్తున్నామని చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సాబాద విజయ్‌కుమార్‌తో కలిసి అత్తాపూర్, మారుతీనగర్, హైదర్‌గూడ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు రెండు రోజులకు ఒకసారి గంటసేపు వచ్చే మంచినీరు ప్రస్తుతం 40 నిమిషాలు మాత్రమే వస్తున్నాయని, లో ప్రెషర్‌తో కారణంగా నీరు అందక ఇబ్బందులు పడుతున్నామని ఆయన దృష్టికి తెచ్చారు. దీనిపై మల్లారెడ్డి స్పందిస్తూ జలమండలి జీఎం చంద్రశేఖర్, మేనేజర్ వినయ్‌లకు ఫోన్ చేసి సమస్యను వివరించారు. మంగళవారం ఉదయం మారుతీనగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి పైపులైన్‌ను తనిఖీ చేయిస్తామని హామీ ఇచ్చారన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎక్కడ ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మూసీ ప్రక్షాళన కమిటీ కన్వీనర్ సనివెల్లి జయానంద్‌రెడ్డి, డివిజన్ ప్రధాన కార్యదర్శి రాజు పహిల్వాన్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు రంజాన్ కానుకలు

హస్తినాపురం: ముస్లిం మైనార్టీల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వాటిని పకడ్బందీగా అమలు పరుస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్‌అన్నారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో ఉన్న మజీదుల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముస్లింలకు రంజాన్ కానుకలు కార్పొరేటర్ సుజాతనాయక్ అందజేశారు.

వేధింపులతోనే గోపీనాయక్ ఆత్మహత్య

- హస్తినాపురం యువతిని ప్రేమించిన యాదాద్రి జిల్లా యువకుడు
- యువతి కుటుంబసభ్యులు బెదిరించడంతో ఆత్మహత్య
- పోలీస్‌స్టేషన్ ఎదుట మృతుడి బంధువుల ధర్నా



పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న మృతుడి బంధువులు, కుటుంబ సభ్యులు



గోపీనాయక్ (ఫైల్)

హస్తినాపురం: కులాంతర వివాహం చేసుకున్నాడని అమ్మాయి కుటుంబ సభ్యులు వేధించడంతో గోపీనాయక్ ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి కుటుంబసభ్యులు ఆదివారం వనస్థలిపురం పోలీస్ స్టేషన్ ముందు ధర్నాకు దిగారు. బాధితులు తెలిపిన మేరకు.. హస్తినాపురం ఈస్ట్‌కాలనీకి చెందిన యువతి, యాదాద్రి భువనగిరి జిల్లా చిల్లాపురం పరిధిలోని డాకు తండాకు చెందిన గోపీనాయక్ రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఉన్నత చదువు లకోసం లండన్ వెళ్లిన గోపీ 2021 నవంబర్ 30 తిరిగి వచ్చాడు. అదేసంవత్సరం డిసెంబర్‌లో యువతి తండ్రి నాగార్జున తప్పుడు కేసు పెట్టించి వేధింపులకు గురిచేశాడని వాపోయారు. ఇదిలా ఉండగా ఆరునెలల క్రితం యువతి, గోపీనాయక్‌లు వివాహం చేసుకోవడంతో ఆగ్రహించిన నాగార్జున.. గోపీనాయక్‌ను బెదిరించి తన కూతురుని తీసుకెళ్లాడని ఆరోపించారు. కూతురి జోలికి వస్తే చంపేస్తానని నాగార్జున బెదిరించే వాడని శనివారం కూడా బెదిరించాడని వాపోయారు. దీంతో భయభ్రాంతులకు గురైన గోపీనాయక్ (26) రాత్రి 8 గంటల ప్రాంతంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు ఆరోపించారు. ఆదివారం ఉదయం నుంచీ పోలీస్‌స్టేషన్ ముందు కూర్చుని నాగార్జున కుటుంబ సభ్యులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేసినా పోలీసులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సంస్థాన్ నారాయణపురం మాజీ మండల అధ్యక్షురాలు బుజ్జినాయక్ ఆరోపించారు. ఆత్మహత్యకు కారణమైన వారిని అరెస్ట్ చేయాలని లేదంటే తాము ఇక్కడనుండి కదిలేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. దీంతో పోలీసులు వారికి నచ్చజెప్పి గోపీనాయక్ ఆత్మహత్యకు బాధ్యులైన నాగార్జున కుటుంబ సభ్యులపై అట్రాసిటీ కేసు తోపాటు ఆత్మహత్యకు ప్రేరేపించినందుకు పలుసెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఎఫ్‌ఐఆర్ కాపీ ఇవ్వడంతో ధర్నా విరమించుకున్నారు. గోపీనాయక్ తండ్రి జగ్రునాయక్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యారంగ సమస్యలపై పోరాటం



కడ్తాల్: జెండా ఆవిష్కరణలో ఎన్‌ఎస్‌యూఐ నేతలు



ఆమనగల్లు: పండ్లు పంపిణీ చేస్తున్న ఎన్‌ఎస్‌యూఐ నాయకులు

- ఘనంగా ఎన్‌ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవం

కడ్తాల్: విద్యారంగ సమస్యలపై ఎన్‌ఎస్‌యూఐ పోరాటం అభినందనీయమని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు షాబుద్దీన్ ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఎన్‌ఎస్‌యూఐ జెండాను ఎగురవేసి మాట్లాడారు. దేశంలో విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం సాగించే నాయకులు ఎన్‌ఎస్‌యూఐ నాయకులేనని అన్నారు. గత 52 సంవత్సరాలుగా ఎన్‌ఎస్‌యూఐ విద్యారంగ సమస్యలపై పోరాటం చేస్తోందన్నారు. రానున్న రోజుల్లో మరింత చురుకుగా సమస్యలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీక్యానాయక్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బిచ్యానాయక్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హీరాసింగ్, సర్పంచ్ సేవ్యానాయక్, నాయకులు శ్రీకాంత్, పవన్, దర్శన్, వంశీ, భాను, రాజేశ్, రాజేందర్, తులసీరాం, మధు, సత్యంయాదవ్, కృష్ణ, పురుషోత్తం, ఇమ్రాన్, రమేశ్, శ్రీను, తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

ఆమనగల్లు పట్టణంలో..

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో ఆదివారం ఎన్‌ఎస్‌యూఐ 53వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలో ఎన్‌ఎస్‌యూఐ జెండాను ఎగురవేశారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యుఐ నాయకులు మహేశ్, అబ్దుల్, రాహుల్, దనుష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

దిల్‌సుఖ్‌నగర్: అభివృద్ధి పనుల్లో నాణ్యతలో రాజీ పడకుండా పనులు త్వరగా పూర్తి చేసి కాలనీ వాసులకు అందుబాటులోకి తీసుకురావాలని బీఆర్‌ఎస్ ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షులు నగేష్, నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ అన్నారు. ఆదివారం ఆర్‌కేపురం డివిజన్ గ్రీన్‌హిల్స్ కాలనీలోని పార్కులో రూ. 30 లక్షల నిధులతో చేపట్టిన కాంపౌండ్ వాల్, వాకింగ్ ట్రాక్ పనులను బీఆర్‌ఎస్ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీ వాసులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు.